కాలచక్రం నిలిచింది

ముకుందాన్ని బెంగుళూరు పిచ్చాసుపత్రిలో పెట్టారన్న వార్త విన్నప్పుడు కాలచక్రం నిలిచిపోయినట్లనిపించింది. ఆరుగురు అన్నదమ్ముల్లో నాలుగోవాడు ముకుందం. నలభై యేళ్ళ నడివయస్కుడు, చదువుకున్నవాడు. దత్తతవల్ల సంక్రమించిన రెండు మేడలు, తోట, యాభై ఎకరాల భూమీ గల స్థితిపరుడు. మామగారు జిల్లాకలెక్టరు. జ్ఞాపకంవొచ్చినప్పుడల్లా కాలక్షేపానికి బి.ఎల్. పరీక్షకి కడుతుంటాడుగాని, ఉద్యోగం చేసే అవసరంగాని, అభిలాషగాని అతనికిలేవు. అన్నదమ్ములందరూ మంచి పదవుల్లో వున్నారు. కుటుంబంలో వెనక ఎవరికీ పిచ్చి ఎత్తినట్లు లేదు. మనోవ్యాకులత, చీకూ–చింతా లేకుండా హాయిగా జీవితం గడిచిపోతున్నప్పుడు, ముకుందం పిచ్చాసుపత్రిలో ఎందుకు గడపవల్సివొచ్చిందో నాకర్థంకాలేదు నాకుపిచ్చెత్తినట్లయింది. కాలచక్రం కదలనట్లనిపించింది. కాలచక్రం కవిమెళకువ. రచనాశిల్పంలో అదొక విసురు. దానిగొడవ ఎవరిక్కావాలి?

రెండవ ప్రపంచసంగ్రామం ప్రారంభమైందన్న వార్త తెలిసినప్పుడూ, మహాత్ముడు పరమపదించాడన్న వార్త విన్నప్పుడూ ఓ క్షణం పాటు కాలచక్రం నిలిచిపోయినట్లనిపించింది. మళ్ళా ముకుందం పిచ్చి విషయం తెలిసినప్పుడు అట్లాంటి అనుభవం కలిగింది. వైమానికుడు సహారా ఎడారనుకుని నేలమీదికి అడుగుపెట్టగానే ఎటుచూచినా మంచే జలపాతం ఒంపుదగ్గర నిలిచిపోయింది. ఇట్లాంటివి జరిగినప్పుడు వూపిరి బిగబడతాం. గుండెకొట్టుకోడంలో ఒక లయ, క్రమం వుంటాయిట. మధ్యలో ఒకసారి కొట్టుకోడం మానేసి – ఒక 'బీట్' విడిచేసి, తరవాత మళ్ళా మామూలుగా గుండె కొట్టుకోవడం అసంభవంకాదని వైద్యశాస్త్రజ్ఞులు చెబుతున్నారు. మధ్యనున్న స్థలంగుండా ప్రయాణం చెయ్యకుండానే, ఒక పదార్థం ఒకచోటునుండి మరోచోటికి చేరుకోవడం సంభవమేనని భౌతిక

శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. ఇల్లాంటివి సంభవమైనప్పుడు ముకుందానికి పిచ్చెత్తడం మాత్రం ఎందుకు సంభవంకాకూడదనుకుని సమాధాన పడినా, ఆ అనుభూతి అన్వేషణకి నన్ను పురిగొల్పింది. వ్రాసేస్తే ముకుందం వ్యక్తిత్వం విశదపడుతుందేమోనన్న ఆశతో ఈ రచనకి ఉపక్రమించాను.

ముకుందం అనేకమంది సామాన్య వ్యక్తులలో ఒకడైతే అతన్ని గురించి నేను పట్టించుకోను. ఓరకంగా అతను అపూర్వవ్యక్తి. ఆధునిక యుగంలో ఆనందాన్ని సాధించగలవ్యక్తులు అరుదు. నాతోటి మానవులలో 'నాజీవితం హాయిగా, సంతోషంగా 'గడిచిపోతోంది' అని అన్నవారు నాకు తటస్థపడలేదు. మనలో ప్రతివారికీ ఏదో లోటు. ఆరోగ్యం వుండదు, అవకాశాలుండవు, డబ్బుండదు. ప్రేమకొరకు చెడిపోతాం. తీరిక కోసం పనిచేసి పొందిన తీరికలో ఇంకా పనిచేస్తాం. ఏకాంతంలేదు. ఇల్లొకజైలు, ఇందులోంచి తప్పించుకుని గుంపులో కలసిపోతాం. మరోవ్యక్తి సమక్షంలోగాని, మనం సజీవులమై వున్న విషయం బుజువుకాదు. కుళ్ళు, కృత్రిమం, జాడ్యం, దాస్యం, నిద్రలోకూడా విరామంలేని మనోవ్యాకులత-ఈ మహాగంద్రగోళంలో పరిభ్రమిస్తూవున్న ఈ వ్యక్తులందరికీ ఎందుకు పిచ్చెత్తలేదా అన్న సంశయం, ఒస్తుంది. పిచ్చెత్తకుండా, మామూలుగా ఉన్న వారుంచేకదా పిచ్చిమందాన్ని కొలిచి విలువకట్టడానికి!

ఆనందమయజీవి ముకుందం. ఆవిధంగా అతను అపూర్వమైన వ్యక్తి. మరోవిశేషంవుంది. ముకుందంలాంటి వ్యక్తులు మనసంఘంలో చాలామంది వున్నారు. ఆ రకం మనస్తత్వం గలవారికి అతను ప్రతినిధి. ఎప్పుడో ఒకప్పుడు ముకుందాన్ని, అతని తెగవారిని కలుసుకోక తప్పదు. వారినిమీరు ప్రేమించవచ్చు. ద్వేషించవచ్చు, కాని వారిబారి నుండి తప్పించుకు పారిపోలేరు. ఆఫీసుల్లో, క్లబ్బుల్లో, పార్కుల్లో, సినిమా హాలుల్లో, దుకాణాలలో, రైలుప్రయాణంలో, ఎక్కడో అక్కడ అతన్ని మీరు కలుసుగునే వుంటారు. ఎవ రతను? అత నొక మాటకారి. వాగుడు కాయుడు. అతను మాట్లాడటం మొదలుపెడితే, మరిఆగడు; ఎవర్నూ

అతన్ని ఆపలేరు. పిడుగు పైనబడినప్పుడు ఎవరు తప్పించుకోగలరు? జలపాతాన్ని అరచేతిలో ఆపడం ఎంత సుళువో అతని నాలుక పరిభ్రమణాన్ని ఆపడం అంత సుళువు. ఈపాటికి మీరు గ్రహించేవుంటారు. ఆంగ్లంలో అతన్ని 'బోర్' అంటారు. ఎన్నో హాస్యపత్రికలు, ఎందరో హాస్యరచయితలు అతని వూసులు చెప్పుకుని, రోజులు గడుపుకుంటున్నారు.

అతని గాథలు వేనోళ్ళ వింటాం. అత నొక పురాణ పురుషుడు.

ముకుందం మంత్రజాలంలో చిక్కుకుని, గిలగిల తన్నుకుని, బైటపడినవాళ్ళల్లో నేనొకణ్ణి. అతన్ని ద్వేషించాను; విమర్శించాను; నిర్మూలం చెయ్యాలని సంకల్పించాను. తిరస్కరించాను, హేళనచేశాను. జాలిపడ్డాను; చివరికి ప్రేమించాను. అతన్ని పిచ్చాస్పత్రిలో పెట్టిన ఈ ప్రపంచానికి పిచ్చి.

ఈరకంగా ప్రపంచంపై కోపించి నేను సాధించిం దేదీ లేదు. అందుచేత తమాయించుకొని ముకుందంతో నాపరిచయాన్ని ఉద్రేక రహితమైన ధృక్పథంతో స్మరిస్తాను.

ముకుందాన్ని గురించి కుతూహలపడడానికి ఏవేవో చాలా కారణాలు చెప్పాను. కాని, అసలు విషయం వదిలేశాను. అతనితో దూరపు బంధుత్వం వుంది—ఆవిడ తాలూకు దూరపుచుట్టం—నా తాలూకే అని చెప్పుకోడంలో చిన్నతనం వుందని కాదుస్మాండి—అసలువిషయం అది.

ఆదివారం ఉదయం తొమ్మిదైంది.

వీధిలోకని బైలుదేరి పదిమెట్లు దిగాను. పదకొండో మెట్టుమీద ముకుందం ప్రథమంగా తటస్థపడ్డాడు. తనుఫలానా అని పరిచయం చేసుకున్నాడు.

"ఓహో అల్లానా—మిమ్మల్ని గురించి వినడమే గాని ఎప్పుడూ చూడలేదు—రండి, రండి, లోపలికెడదాం" అని ఆహ్వానించాను. భుజం మీద చెయ్యేసి నన్ను నిలిపేశా

'నన్ను గురించి విన్నారన్నమాట. చూసింతర్వాత, 'ఇదేమిట్రా ఎందుకు చూశాను?' అని అనిపించలేదుకదా! ఏ ముసిలాడినో, ముక్కాడినో అనుకున్నారా? అమ్మాయి చెప్పిందేమో లెండి నేనంత పెద్దవాణ్ని-అంటే ముసిలివాణ్ని-కానండోయ్. అసలు ముసిలాళ్ళంటూ ఉండరని నా దృఢ విశ్వాసం. ప్రతివాడూ తనకున్న వయస్సుకి పది హేనేళ్ళ తర్వాతేగాని వార్ధక్యమంటూ ఉండదనుకుంటాడు. నాకు నలభై అయితే, యాభై అయిదేళ్ళ వాళ్ళందరూ ముసిలాళ్ళన్న మాట. నా కరవై అయితే, డెభ్భై అయిదేళ్ళ వాళ్ళందరూ వృద్ధులన్నమాట. అదీ "థీరీ". మీకు ముప్ఫై-అవునా ? మీ ఉద్దేశ్యం, నలభై అయిదు దాటిన వాళ్ళంతా ముసిలాళ్ళు. నేనిక్కడి కెందుకొచ్చాననా మీ ప్రశ్న-మీకు తెలీదేమో-అమ్మాయి చెప్పలేదేమో-ఇక్కడ బ్రిడ్జి మాచస్ ఉన్నాయి, అందుకొచ్చాను. నేను బ్రిడ్జి ఆటగాణ్ని లెండి. మీకొచ్చా ? ఆంధ్రలో ఎక్కడ టోర్నమెంటయినా, మావాళ్ళు నన్ను పంపిస్తూ ఉంటారు. ఇంకెవరూ లేనట్లు. ఏంచేస్తాం, పెద్దలు మనమీద వోభారం పడేసిం తర్వాత, మనం నిర్వర్తించక తప్పదు. క్రితం నెల బెంగుళూరులో రన్నరప్-పేపర్లో చూశారుగా, అంటే, బెంగుళూరు లోకల్ పత్రికల్లో పడ్డాయిట లెండి-ఇక్కడి మన పత్రికలు యూస్‌లెస్. వీళ్ళ ఉద్దేశ్యంలో బ్రిడ్జి ఒక ఆటేగాదు. నేనే ఇంగ్లండులో పుట్టి ఉంటే, ఈ నా ఆటకి, పార్లమెంటు మెంబరుగా చేసేయ్యరూ! మావాళ్ళు వొచ్చేయేడు ఇంగ్లండు పంపుతామంటున్నారు నన్ను-భారం పడిన తర్వాత..."

"...లోపలి కెడదాం..."

"ఓడలోనే వెడతాననుకోండి. నాకి ఎయిర్ ట్రావెల్ సుతరామూ ఇష్టం లేదుస్మండి. ఎందుకంటారా? విల్లు వ్రాసిగాని విమానం ఎక్కడం మూర్ఖత్వం. విమానం ఎక్కి నేను క్రమంగా గమ్యస్థానం చేరుకుంటాను అని ధీమాగా చెప్పగల విమాన యాత్రికుణ్ణి ఈ జగత్తులో మీరు నాకు చూపగలరా ? స్వామీ ? నిరుడు బిలియర్డ్స్ మాచెస్‌కి విమానంలో సిమ్లా ప్రయా

ణం తగిలింది ? ఎల్లాగో తప్పించుకున్నా వెళ్ళకుండా. ఇంతకీ మరో ఏడాదిపాటు నూకలు మనకీ భూప్రపంచం మీద వ్రాసిపెట్టాడు పర మాత్మ. ఎందుకు వెళ్ళలేదని సిగ్గూ—అమ్మాయి చెప్పే ఉంటుందేమో లెండి..."

"రండి—కూర్చుని, కాఫీ పుచ్చుకొని సావకాశంగా మాట్లాడు కుందాం..."

అని మెటెక్కాను. ఆయన ఆరో మెట్టుమీద నిలిచిపోయాడు.

"నాకు కాఫీ అనీ, టీ అనీ పట్టింపులు లేవు. ఏదైనా పుచ్చు కుంటాను. అసలు లేకపోయినా అయ్యో లేకపోయిందే అని ఇదవను. ఒకసారి చెరుకుపల్లి జమీందారుగారు డిన్నరిచ్చారు. మజ్జిగనుకొని కాఫీ వొడ్డించారు."

నేను లోపలికెళ్ళి, ఆవిడ చెవిని యీ వార్తపడేసి, కుర్చీలు, బల్లలు కాస్త సర్ది, యివతలకొచ్చాను. ఆయన మూడో మెట్టుమీద నిల బడి మాట్లాడుతున్నాడు—మెట్ల కొంపల్ని గురించి.

"తంజావూర్లో వో చెట్టియార్ యింటికి వెళ్ళాం..."

దీర్ఘోపన్యాసానికి తావివ్వకుండా, ఎక్కడికక్కడ నిలదొక్కడం మంచిదనుకొని అడ్డుప్రశ్నల కుపక్రమించాను.

"తంజావూరా ? ఎవరెవ రెళ్ళారు ?

"మామగారితో-కోయంబత్తూరు నుండి కార్లో వెళ్ళాం. ఆ చెట్టియారింటికి నాలుగుచోట్ల మెట్లున్నాయి. మధ్య హాల్లో మామగారూ నేనూ విడిపొయ్యాం. నేను వరండా మెట్ల మీదుగా వెళ్ళాను. వాళ్ళు ముందు అరుగులమీద మెట్లగుండా వెళ్ళినట్లున్నారు. ఈ రెండు మెట్ల వరుసల్లూ పైన బాల్కనీలో కలిసినట్లున్నాయి—టపీమని ఆ చెట్టియారూ నేనూ గుద్దుకున్నాం."—నవ్వడం సాగించాడు.

చెట్టియార్ ఘట్టం ముగిసినందుకు నిట్టూర్చాను. ఇంతలో ఆవిడా

లోపల్నుంచివొచ్చింది. చిరునవ్వుతో "ఎప్పుడు రావడం ?" అని అడిగింది.

అవొక అర్థంలేని ప్రశ్న.

"సామాన్లేవి ?"

అంత బొత్తుగా అర్థంలేని ప్రశ్న కాదేమో! "నేనొచ్చి నాలుగు రోజులైంది-సరిగ్గా చెప్పాలంటే మూడున్నర రోజులు. క్లబ్బుగదుల్లో విడిది. టెన్నిస్ మాచెస్ అవుతున్నాయిగా. మా పినమామగారు పెద్ద టెన్నిస్ ఆటగాడులే-నాతో ఆడితే వో సెట్టుకి రెండు గేములు కూడా గెలవలేడు-అయినా మామగార్ల ఆట మెచ్చుకోడం తప్ప యీ అల్లుళ్ళు ఏం చేయగలరు ? మీరు టెన్నిస్ ఆడతారా ?"

"అబ్బే లేదండి"

"సాయంత్రం ఉభయులూ రండి, నా ఆట కూడా చూద్దురుగాని, మొన్న విజయనగరంలో మన వాళ్ళంతా వచ్చారు. నాకు తెలుసులే ఎందుకు నవ్వుతున్నావో. చిన్నప్పుడు ఆటలూ పాటలూ ఏవీ రావు, ఈ ఆట ఎట్లాగొచ్చిందా అని. ఇల్వపురం జమీందారు తమ్ముడూ నేనూ స్నేహితులం. వాళ్ళు జర్మనీ నుంచి వో కోచ్‌ని తెప్పించారు. రాత్రిళ్ళు గ్యాస్‌లైట్లు పెట్టుకుని ఆడేవాళ్ళం."

"కాఫీ పుచ్చుకోండి——" కాస్త చప్పరించాడు.

"సామాన్లు క్లబ్బులో పెట్టాను. మీ రిక్కడున్నారని మొన్న తెలిసింది. సరే-చూసిపోదామని-చుట్టాల్ని చూడకపోతే మా ఆవిడ వూరుకోదు. మా మరదలు వోసారి నెల్లూర్లో వొక స్నేహితురాలింటి దగ్గర దిగిందట. నేనేమో గురవయ్యనాయుడుగారి చైర్‌మన్ ఎలక్షన్స్ సందర్భంలో నెల్లూరెళ్ళాను. మరదలుపిల్ల అక్కడుందని నాకేం తెలుసు ? ఆమెను చూడకుండా వొచ్చినందుకు మా ఆవిడ వారం రోజులు నాతో మాట్లాడలేదు-అంటే నేడయింట్లో ఆవిడతో ఉన్న పది నిమిషాలూనూ, నాకు ఏకాంతంగా ఇంట్లో ఉండే ప్రాప్తి లేదంటే నమ్మండి. పనీ లేదు, తీరుబడీలేదన్న సామ్యంగా ఉంది."

'మరదలుకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా ?" అని అడిగింది ఆవిడ.

"ఆవిడ పెళ్ళి చేసుకుంటుందీ ? నాకు నమ్మకం లేదు. ఆయన కట్నం దమ్మిడీ ఇవ్వనంటాడు. ఆ గడింపంతా ఏం చేస్తాడో, కర్మ! పీనాసని కాదు. అదొక ఆదర్శంట. మరి నాకెల్లా ఇచ్చాడు—కటికసొమ్ము పదివేలు. డిన్నర్‌కి నాలుగు వేలయిందిట-గవర్నర్‌గారి అంతరంగిక కార్యదర్శి అతిథిగా విచ్చేశాడులే. బాణాసంచాకి వెయ్యి, ఊరేగింపు, విమానానికి ఐదొందలు-ఆ రోజుల్లో-ఇప్పుడైతే, ఖర్చంతా వో యాభై వేలవును. మా కొచ్చిన పెళ్ళిబహుమతులు, వో ఐదారు వేలుంటాయి. కట్నాలద్వారా, సగంఖర్చు రాబట్టాడనుకో – నువ్వచ్చావుగా – నీ కింకా అప్పటికి పెళ్ళికాలేదుగా. కట్నాలు పుచ్చుగోడం మనబోటి చదువుకున్న వాళ్ళది పొరబాటే-కాదన్ను. కాని సంఘంలో ఓ ఆచారం వున్న తర్వాత పాటించక తప్పుతుందా ? సరే-సరోజకి ఎంతసేపూ, చదువూ, సంగీతం— సినిమాలు, షికార్లు—పిక్‌నిక్‌లు. పెళ్ళి చేసుకోవాలన్న ఉద్దేశమేలేదు. ఏమాటకామాటే చెప్పాలి-మా ఆవిడ ఎంత చదువుకున్నదైనా, పూర్వ కాలపు మనిషే అనాలి. కాస్తంత దైవభక్తి, పూజ, పునస్కారం, యాత్ర, కొలువు—కలెక్టర్‌గారు వారిహయాంలో చేసిన దుండగాలు దురంతాలకి పరిహారార్థం పురాణకాలక్షేపం, గీతాపారాయణం ఆదివారం జరిపించి, పండితుల్ని సత్కరించే ఆచారం వుండబట్టే, అమ్మాయికి యిదంతా అబ్బిందనుకో. మనం తప్పించుకున్నాం. సరోజ కివి గిట్టవు, నాకుమల్లే. అందుకనే లోలోపల నే నంటే యిష్టం అనుకుంటా.'

'నువ్వు వంట విషయం చూడు' అన్నాను ఆవిడ నుద్దేశించి.

'నాకోసం వంటచెయ్యకండి. క్లబ్బులో డిన్నరుంది. కబుర్లు చెప్పు కుందాం. మీరువొంట కెవర్నైనా పెట్టుకోండి లేకపోతే ఇదేచిక్కు. ఇంటి కెవరైనా వస్తే, వారితో మాట్లాడే అవకాశం వుండదు. ఓసారి సేలం సబ్‌కలెక్టర్ – మళయాళి - భార్యాసమేతంగా గుంటూరొచ్చాడు. అత్తగారు

వొంటకనీ, అమ్మాయి కాఫీకనీ లోపలికెళ్ళారు పనిమనిషి పేరమ్మనిఒప్పు జెప్పి! ఆవిడకి కాలక్షేపం ఎల్లా జరుగుతుంది. పేరమ్మ ఏంమాట్లాడుతుంది? బుచ్చమ్మలా గుడ్లప్పగించి అల్లా నిలబడి చూస్తూ వుంది. పేరమ్మ ఫాషన్‌గా వుంటుందిలే. ఇదిగో ఈ సినిమాలొచ్చింతర్వాత అది మరీ సినిమాస్టార్‌లా తయారైంది. మాఆవిడా, సరోజ ఇచ్చిన జాకెట్లేవుంటాయి ఓ డజను. వీళ్ళకిసైజుకుదరక దానికి బహూకరిస్తూంటారులే. దాన్ని చూసి సరోజ అనుకుంది కాబోలు-ఇంగ్లీషులో సంభాషణ సాగించింది ఆవిడ. ఇదేమో నవ్వింది దట. మళ్ళా ఆవిడ ఇంగ్లీషులో ఏదో అడిగిందట. పేరమ్మ లోపలి కెళ్ళి చీపురు తీసుకొచ్చిందట వూడుద్దామనుకుని ఆవిడ కోపంతో చరచరా నడుచుకుంటూ బైటకెళ్ళి, మామగారి డ్రైవర్ని పిలిచింది. కార్లో ట్రావెలర్స్ బంగళా కెళ్ళిపోవడం-మామగారు పేరమ్మని మానిపిస్తానని బెదిరించడం, అది లబోదిబోమని ఏడవడం, నే వెళ్ళి సర్దుబాటుచేసి ఓ వంటలక్కని కుదర్చడం, వచ్చిన అతిథుల్ని ఎల్లా వినోద పరచాలో తెలియచెప్పడం – వారి కుటుంబచరిత్రలో ఒక అపూర్వఘట్టం.'

'కాసేపు నే అల్లా వెళ్ళొస్తాను. మీరు పత్రికచూస్తూ వుండండి' అన్నాను. ప్రశ్నార్థకంగా చూశాడు ముకుందం.

'సినిమాకా ?'

ఎట్లా కనుక్కున్నాడో చిత్రం! అసలు నిజంగా సినిమాకనే బైలుదేరాను. కాస్తంత అబద్ధంఆడాను.

'డాక్టర్ మాధవయ్యగారింట్లోంచి టెలిఫోన్‌చేసి, రాత్రికి ఏం ఆటాడుతున్నారో కనుక్కునొద్దామని బైలు దేరాను' అన్నాను.

'అయినా, అమ్మాయిలేకుండా మీరొక్కరూ సినిమాకెళ్ళడం భావ్యమా చెప్పండి? మా కళ్యాణి వూరుకోదు. నేను వాళ్ళింట్లోవుంటే ఎక్కడికెళ్ళినా ఇద్దరం కలిసెళ్ళాల్సిందే'

'ఆమెను కూడా ఇప్పుడు మీతో తీసుకురాలే దేం?' అన్నాను.

'ఆవిడకి ఆటలుచూడ్డ మంటే విసుగు. లెక్చర్లు, క్లబ్బులు, పార్టీలు,

ఇవేవీ గిట్టవు. నాకివి లేకపోతే గడవదు. మళ్ళా సరోజ అల్లా కాదు...'

ఆయన నింకా మాట్లాడుతూనే వున్నాడు. నేను బైటికి నడిచాను. వెడుతూ మా పనివాడు ముసలయ్యని అయ్యగారికి ఏం కావాలో కను క్కుంటూవుండమని చెప్పి వెళ్ళాను. ఓగంటలో తిరిగొచ్చాను. ఆయన ముసలయ్యతో మాట్లాడు తున్నాడు. ముసలయ్య వింటూన్నట్లు లేదు. గోడకి జేర్లబడి కునికిపాట్లుపడుతున్నాడు.

'పోరంబోకుపొలం ఓఎకరం నాకప్పజెప్పు. రెండేళ్ళల్లో బంగారం పండిస్తాను. మామగారి దో రెండెకరం బీడుంది. జిల్లావ్యవసాయశాఖాధికారి స్నేహితుడులే. అతని సలహామీద కావల్సిన ఎరువు అదీ వేశాను. ఇవాళ పదివేలిచ్చి కళ్ళుమూసుకు కొంటామని ఎగబడుతున్నారు. నువ్వు రాత్రి పొలంకాకుంటావా?'

'మాట్లాడవేం ముసలయ్యా—నిన్నే అయ్యగా రేదో అడుగు తున్నారు'

'అంతే నెగండి' అని దూరంగా వెళ్ళి చుట్టిముట్టించే తతంగం జరుపుతున్నాడు.

'ముసలయ్య మా మామగారి పొలం కాపు. కాస్తసాయంగా వుంటాడు. ఇప్పుడు పొలంపను లేమీ లేవని ఇక్కడికి పంపించారు' అన్నాను.

పొలంలో పామునిచూసి జడుసుకునే ఘటంలా వున్నాడు. పాముని పట్టడం నేరిస్తేగాని, ఎవరికీ పొలంలో పనిచేసే అధికారం లేదంటాను. ఓసారి రావులపాడులో సాయంత్రం చేలల్లోంచి వస్తున్నాం. కాలికేదో మెత్తగా తగిలింది. నేను గమనించలా.

రాత్రివెన్నెట్లో భోజనానికి కూర్చున్నాం. రెయ్యిమని నా విస్తరి ముందుగా వొచ్చి పడగెత్తింది. అందరూ అదిరి పొయ్యారు. 'మీరెవ్వరు భయపడకండి, నాకోసం వొచ్చింది' అన్నాను కిమిన్నాస్తి. కరణంగారి భుజంపైన సిల్కుకండువా తీసిచటుక్కున గిరవాటెట్టా. దాన్ని కరిచేసి

అందులో ఇరుక్కుపోయి, లుంగచుట్టుకుపోయింది. మరోసారి మైలవరం రాజాగారింట్లో...'

"వీను ముసలయ్యా!" అని ఓ కేకేసి, స్నానాని కెళ్ళాను. వొచ్చాను. ఆయన ముసలయ్యతో ఏదో చెప్పుగుంటూ పోతున్నాడు, పులివేట విషయం.

"చెప్పండి. చెప్పండి" అంటూ కుర్చీలో కూర్చుని పత్రిక చదువుకుంటున్నాను.

'నాకెన్నాళ్ళనుంచో పులిని దగ్గరగా ఓఫోటోతియ్యాలని మనసు. అయ్యాపురం జమీందారుబావగా రొకాయన వొచ్చాడు. నలుగురైదుగురం అడవిలోకి ప్రయాణంకట్టాం. మేకని ఎరగాకట్టి చెట్లెక్కాం.

రెండుగంటలవరకూ నిశ్శబ్దం. తరువాత కోతులు కిచకిచలాడాయి. దూరంగా గర్జింపు వినబడింది. నే కూర్చున్న చోటునుండి మేక కనబడటంలేదు. ఎప్పుడొచ్చిందో ఎప్పుడెళ్ళిందో—మేక అరుపు నిలిచిపోయింది. మరోగంటకి దిగిమెల్లిగా నడచిపొయ్యాం. ఒకమైలు వెళ్ళింతర్వాత మేక కళేబరంలోతినగా మిగిలిన భాగాలు ఆకులతో కప్పబడివున్నాయి. దాని చుట్టూ ఒక వల అల్లి, అల్లిక తాళ్ళని కెమెరాక్లిక్‌కి ముడేసి, కెమెరా దూరంగా పొదలోవుంచాం. పులివొస్తుంది. వలమీద కాలుపెడుతుంది. క్లిక్ మంటుంది. ఫోటో పడిపోతుంది. అదీ ఏర్పాటు. ఇంతలో ఏదో చప్పుడైంది. నాతో వున్నవాళ్ళు చెట్టెక్కేశారు. వెనక్కి తిరిగితినికదా, అరఫర్లాంగుదూరంలో నాకేసి వొస్తోంది. పెద్దపులి..."

"భోజనానికి లేవండి..."

అంది మా ఆవిడ. ముకుందం కథలో లీనమైపోయి, వినిపించుకున్నట్లు లేదు.

"అప్పుడేం చేశానని మీ వూహ? కదలకుండా వూపిరిబిగబట్టి, పులికళ్ళల్లోకి చూస్తూ స్తంభించిపొయ్యాను. అదికూడా అల్లానే నిర్ఘాంతపడి నా మొహంలోకి చూస్తూ నిలబడిపోయింది. చూపు తప్పించకుండా,

మెల్లగా ఒక్కొక్క అడుగే వెనక్కి వేసుగుంటూ, వో ఫర్లాంగు వచ్చే శాను. అది విసుగెత్తి పారిపోయింది..."

"భోజనానికి..."

"ఆనాడు నేను కదలివుంటే, పులికి భోజనం దొరికి వుండును. నువ్వీనాడు నాకు భోజనం పెట్టే అవకాశమే లేకపోను..."

ఒహో హా! హో! అంటూ ముకుందం దీర్ఘంగా నవ్వి, ఆ కుర్చీ లోంచి లేచి పడక్కుర్చీలో కాళ్ళుజాచి విశాలంగా పడుకున్నాడు.

పన్నెండున్నర దాటింది; నా కాకలిగావుంది. పుట్టంతా మునిగి పోయినట్లు ఆయన్ని వో ప్రశ్న అడిగాను.

"ఏమండీ-వేటకి వెళ్ళినప్పుడు, తుపాకులూ అవీ తీసుకెడతారు గదా, మరి పెద్దపులి మీదికివొస్తున్నప్పుడు తుపాకీ పేల్చలేకపోయారా?"

ముకుందంగారికి చాలా కోపం వచ్చింది ఆయన దగ్గర తుపాకీ వుండివుంటే ఆ క్షణంలో నన్ను పేల్చేసి ఉండును, ఆ ప్రశ్న అడిగి నందుకు.

"ఇంకా నయం-మీకు ప్రతివిషయం, తుపాకీ విషయం బొత్తిగా తెలీదనుకుంటా తుపాకీ సరైన పొజిషన్‌లోకి తీసుకురావడానికి కొంత చేతులకదలిక అవసరం. ఏ మాత్రం కదలిక జరిగినా, వెంటనేవొచ్చి మీదపడి చంపేస్తుంది పులి. అంచేత దాని కళ్ళల్లోకి చూస్తే అది భయపడి పారిపోతుంది. అట్లాంటి సందర్భాలలో మన తెలివి పనిచెయ్యదు. శరీరం బుద్ధికి తెలీకుండా, తనజాగ్రత్త అది పడుతుంది. ఓసారి అరవిందుని ఆశ్రమానికెళ్ళాం-కళేబరస్వామితో.

రాత్రివిడిదిలో మంచాలున్నాయి, పక్కలేసి సిద్ధంగా. స్వామీజీ వట్టికింద సంచీ దిండుగా పెట్టుగుని పరున్నాడు. మంచంమీదికిరండి అన్నాను. వద్దు, అందరం కిందే పడుకుందాం అన్నాడు. ఆయనమాట తీసెయ్యలేక, అట్లాగే పడుకున్నాం. ప్రొద్దున్నే అక్కడవాళ్ళొచ్చి మంచం సర్దారు. జానెడు పొడుగు జెర్రి, దిండుకింద విశ్రమిస్తోంది.

అంటే ఏం జరిగిందన్నమాట. మంచంమీద అపాయం వుందిస్మా అని ఆయన శరీరం పసికట్టిందన్నమాట — పంచేంద్రియాలు కాక, ఆరోశక్తి అన్నమాట. అరవిందుడు వ్రాశాడు కూడాను—ఒక యోగి హిమాలయ పర్వతాలలో తపస్సుచేసి ఆత్మశుద్ధి సాధించినందువల్ల లోకాని కేం ఉపయోగం అనివొక దొరగారు ప్రశ్నించారట. అప్పుడు ఆయన అన్నాడుట..."

"చాలా పొద్దోయింది. మీకోసం క్లబ్బులో అందరూ కనిపెట్టు కుంటారేమో" అన్నాను.

"నాకోసం ఎవ్వరూ కనిపెట్టుకోరు. ఓ ఐదునిమిషాలు చూస్తారు - హాయిగా తింటారు. ఎవరాకలి వారిది..."

"మరి మీ కాకలిగా లేదా ?"

"ఆ ప్రశ్నకి సమాధానం మా కళ్యాణే చెప్పాలి. ఓసారి ఆమె నేనూ వాళ్ళ చుట్టాలింటికి పెళ్ళి కెళ్ళాం..."

"నా కాకలేస్తోందండి — మీరు లేవండి — భోజనాల దగ్గర మాట్లాడుకుందాం" అన్నాను. ముకుందం మాట్లాడుతూనే వున్నాడు. నేను భోజనానికి లేచి ఆయన్ని కుర్చీలోంచి లేవదీయవొయ్యాను.

"కొందరిలా నాకు వేళకు భోజనం అనే పట్టింపులేదు. అప్పు డప్పుడూ భోజనం మానేయ్యడం మామూలే-మీరు కూర్చువి కానివ్వండి. ఏం? ఎంతవరకూ చెప్పాను! ఆ—కళ్యాణి నేనూ వెళ్ళాం. వడ్డించారు..."

"వొడ్డించాను. లేవండి—" అన్నది ఆవిడ.

"మీరిద్దరు కూర్చుని తింటుంటే చూడాలని వుంది. కూర్చోండి."

వంటిగంటన్నరైంది. మేం లేచాం. తాంబూలం వేసుగున్నా. ఆయనకాస్త మజ్జిగమాత్రం పుచ్చుకున్నాడు. మైసూరులో తాంబూలాన్ని గురించి చెప్పడం మొదలెట్టాడు. నాకు నిద్రొస్తోంది. ఆదివారం వోగంట నిద్రించడం నా కలవాటు. అవులించాను. కాసేపు విశ్రమిస్తారా — అని స్వగతంగా అడిగి, గదిలో పక్కసద్దాను. మైసూరు దసరా ఉత్సవాలని వర్ణిస్తున్నాడు.

"ఇల్లా ఉపవాసాలుంచే మీరు నీరసించిపోరు? ఆకలితో కబుర్లేం చెప్పగలరు? అని తెగించి అడిగేశాను.

"ఆ ప్రశ్నే మా కల్యాణీ అడుగుతుంది. చాలా మందికి నిద్ర, తిండి, అవసరం. నా కవంత ముఖ్యంకావు. ఓసారి రాజారావుగా-ంట్లో పేకాటకి కూర్చున్నాం..."

ఇంతలో సీళ్ళల్లో మునిగిపోతున్నవాడికి తాడు దొరికినట్లు, పక్కంటి కుటుంబరావు, పత్రిక తీసుకెడదామని వచ్చాడు. ఒకర్ని ఒకరికి పరిచయంచేశాను. కుటుంబరావు స్కూలు మేస్టరు. ముకుందం గారు ఆయన చదువు, మేస్టర్లు, పరీక్ష అనుభవాలు చెప్పడం లంకించుకున్నాడు. అమాయకుడు కుటుంబరావు ఆ యింద్రజాలంలో చిక్కుకున్నాడు. నేనెళ్ళి వెన్ను వాల్చాను.

లేచేటప్పటికి మూడు కావొస్తోంది. కుటుంబరావు లేడు. మా ఆవిడుంది. సరోజ చదువు విషయం చెబుతున్నాడు.

"స్త్రీల ముందు అనకూడదుగాని, పురుషుణ్ణి ఘనకార్యాలకి ప్రేరేపించేది స్త్రీలే. ఆ స్త్రీలే ఘనకార్యం కాస్తా సాధించనీయకుండా ఆటంక పరుస్తారు. లా కాలేజీలో సుశీల అని ఉండేది. ఆమె మెప్పుకోసం మలయప్పన్ అనే మలయాళీ సోదరుడు బాగా చదివి యూనివర్సిటీ వస్టుగా ప్యాసయ్యాడు. ఎమ్.ఎల్. డిగ్రీ తెచ్చుకున్నాడు. వారిద్దరూ వివాహం చేసుకున్నారు. అంతే—అతన్ని కోర్టు కెళ్ళనివ్వదు—ఇరవై నాలుగ్గంటలూ తననిచూస్తూ, మెచ్చుకుంటూ, వినోదించమంటుంది. ఏమైందని మీ ఊహ—ఆరునెలల్లో ఆమెని విడిచిపెట్టాడు..."

నవ్వడం సాగించాడు. ఆవిడను కాఫీ విషయం చూడమని లోపలికి పంపించాను.

"మీరు మొహం కడుక్కోండి. కాఫీ తాగి, అల్లా బైలుదేరుదాం. మీ క్లబ్బులో ఆటకి టైమవుతుందేమో..." అన్నాను.

"నేను మాచెస్‌లో ఆడటం అనేది దైవాధీనం. వాళ్ళకీ తెలుసు. అందుచేత నాకు ప్రతిగా మరో ఆటగాడు లేకుండా నన్ను పంపించరు. ఓసారల్లాగే ఊటీ వెళ్ళాం..."

నా గుండెలో రాయి పడింది. ఈ లెక్కని బైటకెళ్ళడానికా్కని, మరోపని చూసుకోవడానికా్కని వీల్లేదు. ఏం చెయ్యను.

"వారి నావిధంగా భంగపర్చడం భావ్యంకాదు. పదండి నేనూ వస్తాను. మీ ఆట చూళ్ళేదు..." అన్నాను.

"నా ఆట ఇప్పుడేముంది ? ఈ పూట చూడకపోవడమే మంచిది. నే ఆడకపోవడం నాకూ మంచిదే. అదుగో ఆ రాజమండ్రిలో చెయ్యి, కాలూ, రెండూ ఒకేసారి బెణికాయి. డాక్టర్ నెలవరకూ కదల్చక పోవడం మంచిదన్నాడు–నాకు వీలుపడుతుందా. వీళ్ళు నువ్వొస్తేకాని వల్లకాదని చంపుకుతింటారు. కాళ్ళూ చేతులూ మెదణ్ని పనిచెయ్య నివ్వవు. ఆఖరికి బ్రిడ్జి కూడా యివాళ ఆడలేను."

"పోనీ, మనం వెళ్ళిచూస్తూ వాళ్ళకి హుషారిద్దాం–"

లాభం లేకపోయింది. పరమశివన్ అనే తమిళ సోదరుడి వృత్తాంతం చెబుతున్నాడు. నే నిప్పుడంతా ఏకరువు పెడతానని భయపడ కండి. అది నా తరంకాదు. ఆ పూట ఆయన మా యింట్లో ఉండగా మాట్లాడినవన్నీ పూరాగా వ్రాయాలంటే సవాలక్ష గ్రంథం అవుతుంది. నేనేకాదు-ఎవ్వరికీ అది సాధ్యం కాదు. ఆయన ఒక ఏడాదిలో మాట్లా డినవాటిని వ్రాయాలంటే, ఓ డజనుమంది చిత్రగుప్తులు, తమ అసి స్టెంట్లతో ఐదారు సంవత్సరాలు కృషిచేస్తే సాధ్యపడుతుందేమో-అదేనా షార్టుహాండులో వ్రాయడం వారికి వచ్చుంటే మాట. ముకుందం పొట్టిగా, సన్నగా ఉంటాడు. గిరజాల జుట్టు, చామనచాయ, గడ్డం కింద మచ్చ, కళైన మొహం, కంఠం సన్నంగా ఉంటుంది. స్ఫుటంగా ప్రతి అక్షరం సాగదీస్తూ నోరారా ఉచ్చరిస్తాడు. అతనొక ధ్వని ప్రచారక యంత్రం. ఒక భాషా సంస్థ. కాలం నిర్ణయించనట్లు, గోళాల

పరిభ్రమణం ఆగిపోనట్లు, ఆయనలో ఉద్భవమయ్యే ధ్వనివరంపరలకి విరామం లేదు. అడ్డు ప్రశ్నలు, ఊకొట్టడాలు ఆయనకక్కరలేదు. వింటున్నట్టు తల పంకించడంతో నిమిత్తంలేదు. మనం చూస్తున్నప్పుడే సూర్యుడు కాంతికిరణాలను ప్రసారం చేస్తున్నాడా ? మనం కోరినప్పుడే నిండు చంద్రుడు దర్శనమిస్తున్నాడా ? ప్రియురాలొచ్చే వరకూ ఆగమంటే పువ్వు పరిమళించడం మానుకుంటుందా ? నిద్రపోయిన కాసేపు మౌనంగా ఉంటాడనుకుంటున్నారా ? అది భ్రమ. మేఘం వెనకాల సూర్యుడు వెలుగుతూ ఉంటాడు. మనకి కనబడదు శిఖరం వెనుక చందమామ మనకి కనబడకపోవచ్చు. అంతమాత్రంచేత లేదంటామా ! ఎడారిలో వాడిన పువ్వు, సంద్రాల లోతుల్లో ధగధగ మెరసే వజ్రం-మనకేం తెల్సు ? మనం ఎంత అల్పులం ! ఎక్స్‌రే యంత్రాన్ని ప్రయోగించి నిద్రిస్తుండగా ఆయన మెదడును పరికించిన ఒక మహాకావ్యం అల్లుతూ ఉంటుంది ఆ మెదడు. మెదడులో ధ్వని కదలికని వ్రాసే పరికరాన్ని యే శాస్త్రజ్ఞుడో ముందుముందు తయారు చేసి తీరుతాడు. అప్పుడింక ఆధునిక యుగంలో మహాకావ్యాల లోపం ఉండదు.

ఆరు కావొస్తోంది. ముకుందంగారు స్వీయగాథలో పడ్డాడు. అతని భార్య కళ్యాణి ఏ విధంగా ప్రేమించి పెళ్ళిచేసుకున్నదీ—పొరబాటు—ఏ విధంగా పెళ్ళి చేసుకున్న తర్వాత, ప్రేమించడం మొదలెట్టిందీ. అదే శాశ్వతమైన ప్రేమ—ప్రేమంటే ఏమిటి ? ఒక అరగంట లెక్చరిచ్చాడు, సొమ్మసిల్లిపొయ్యాను. ప్రేమలో వైరాగ్యానికి తావుందా ? పవిత్రమైన ఈ యంత్రయుగంలో సాధ్యమా ? మార్క్స్ సిద్ధాంతాలకి ప్రేమకి ఉన్న సంబంధం ఏమిటి ? ప్లేటో ఏమన్నాడు ? వేమన్న పద్యం చూడండి. వాల్మీకి రామాయణం తీసుకోండి. పోతన్న భాగవతం తియ్యండి. అమెరికా విడాకుల తఫిసీళ్ళు—మాస్కోలో విడాకుల సంఖ్య—సంతాన నిరోధం ఆవశ్యకత—పెరిగిపోతున్న జనాభా—మన దేశంలో మూఢాచారాలు.

"నాకు పిల్లలు లేరు. వుండరు కూడా. ఉంటే నా జీవితంలో ఉన్న ఆనందం వారికీ సాధ్యం కాదు. ఆస్తి పంచుకుంటారు. ప్రేమ పంచుకుంటారు, సంతోషం పంచుకుంటారు. వారికి సంతానం కలుగుతుందిగా! నేను తాత నవుతాను. కళ్యాణి అమ్మమ్మవుతుంది. వారి సంతానం బలహీను లవుతారు. ఆస్తి సన్నగిల్లిపోతోంది. వారి సంతానానికి తినేటందుకు ఉండదు. సంఘ పతనం..."

ఆయన సంతానం కూడా ఆయనలాగే తయారవుతే, ఇంకేమున్నా ఉందీ? ఊహించలేకపొయ్యాను.

"నా సంతానం మూగవాళ్ళవుతారు—అమ్మ పోలికే ఐతే—ఎందుకంటారా? కళ్యాణి అంత నాలా మాటకారి కాదు. ఆవిడ కంఠ మాధుర్యం ఒక అపూర్వ అనుభవం..."

ఏడు కావస్తోంది. ఏమిటీ చెయ్యడం? ఆవిడ కాస్తంత టీ, దోసెలు తెచ్చింది. ఆయన దోసెలు తిన్నాడు. నా పళ్ళెంలోనివి కూడా దగ్గరకు లాక్కుని కబుర్లు చెబుతూ తినేశాడు. టీ త్రాగాం. ఇంతలో దైవం కటాక్షించాడు. ఫైరింజన్ మా గుమ్మం ముందునుంచి చప్పుడు చేస్తూ వెళ్ళింది. ఎక్కడో ఇళ్ళు తగలడుతున్నాయంటూ ముసలయ్య వచ్చాడు. రండి చూసొద్దాం" అంటూ ఆయన్ని లేవదీసి మెట్ల కిందికి నడిపించాను. వెనక అహోబలరావుగారిల్లు తగులడిన చరిత్ర చెబుతున్నాడు. నడుచుకుంటూ వెళ్ళాం. క్లబ్బుకి కొంచెం దగ్గరలో గుడిసెలు తగలడుతున్నాయి. క్లబ్బులో వాళ్ళు కూడా చూడ్డానికొచ్చారు. ఆ ఎరుగున్నవాళ్ళ గుంపులో కలిసిపొయ్యాడు. మళ్ళా రాత్రి కనిపిస్తానన్నాడు. తప్పకుండా అన్నాను. ఆ క్లబ్బు మిత్రుల్ని పట్టుకున్నాడు. అంతా ఆ ప్రవాహంలో కొట్టుకుపొయ్యారు. నే యింటి కొచ్చేశాను.

ముకుందాన్ని మళ్ళా మూడేళ్ళ తర్వాత కలుసుకున్నాను. ఆ రోజుల్లో పెద్ద గాలివానొచ్చి రైళ్ళు నిలిచిపోవడం జరిగింది. రైళ్లు తిన్నగా లేవని మా ఆవిడ పుట్టింట్లో ఉండిపోయింది. కారియర్ భోజనం తప్పింది కాదు.

సాయంత్రం అయ్యింది. రైళ్ళ విషయం కనుక్కుందామని రైలు దేయటుండగా మెట్ల మధ్యలో ముకుందం ఢీకొన్నాడు. ఏడాది క్రితం ముకుందం భార్య టైఫాయిడ్ జ్వరం వచ్చి చనిపోయింది. సానుభూతి జాబు వ్రాశాను. కలుసుకోడం ఇదే మొదటిసారి. పరామర్శకి వాక్యాలు కూరుస్తుండగా ముకుందం వాటిని ఉచ్చరించే అవకాశం యివ్వకుండా తనే సాగించాడు.

"ఈ రోజుల్లో రైళ్ళు మరీ అధ్వాన్నమయ్యాయనుకో. ఆలస్యంగా రావడానికి, నిలిచిపోవడానికి యీ తుఫాను ఓ సాకు. ఉత్తప్పుడు ప్రతి రైలు ఓ రోజు ఆలస్యం. తుఫానొస్తే ఓ వారం అంతే తేడా. గుంటూరు నుంచి బండి దిగాను. ఎక్స్‌ప్రెస్ పది గంటలు లేటు. సరే ఆ ప్లాట్‌ఫారంలో యిరుక్కుని ఏ జబ్బో తగిలించుకోడం ఎందుకని, మిమ్మల్ని చూసిపోదామని వచ్చాను. అర్జంటుగా ఢిల్లీ వెళ్ళాలి.

"మా ఊళ్ళో రైతులంతా—భూముల్ని గురించి ఓ కొత్త శాసనం వస్తోందిగా—దానిలో తికమకలు చాలా ఉన్నాయిలే. వారికున్న అభ్యంతరాలని ఓ పిటీషన్ ద్వారా, ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి విన్నవించమని, ఆ పిటీషన్ వ్రాయించి, ఆ నాయకత్వం నా మీద పడేశారు. ఇల్లాంటివి చాలా చేశానులే. వెనక గుర్నాథంగారి ఇంటి తగాదా—ఢిల్లీకి తీసు కెళ్ళాను. ఇళ్ళశాఖవారు నే ఎత్తిన లా పాయింట్లకి ఖిన్నులై, సుప్రీమ్ కోర్టులో ప్రథమస్థానం వహించనందుకు ఆశ్చర్యపడ్డారు. మన లెక్క౯ద తీరుతుంది. అయినా, కళ్యాణి పోయింతర్వాత, నా పాత వ్యాపకాలన్నీ మానుకున్నాను. జీవితం పట్ల నా దృష్టే మారిపోయింది. నే నిప్పు డేవీ పట్టించుకోడంలేదు. ఇప్పుడు గూడా ఆ రైతులంతా చంపుకుతింటే, సరే పరోపకారార్థం ఈ శరీరం అన్న సామ్యంగా, ఊఁ అన్నాను. ఇంక ఓ విషయం నెత్తిన వేసుకున్న తర్వాత, దానంతు తేల్చేవరకూ ఊరుకోనని నీకు తెలుసుగా!"

"పాపం కళ్యాణి..."

"ఏం పాపం పుట్టింతర్వాత చావు తప్పదు కదా. అన్ని మంచి లక్షణాలుండి, ఒక ఆదర్శప్రాయమైన వ్యక్తిగా, నలుగురికీ కన్నెర్రగా ఉన్న కళ్యాణి చాలాకాలం బ్రతకదని లోలోపల అనిపించేదిస్మా! అంత మంచిగా ఉండకూడదనుకో—ఈ ప్రపంచంలో దేవుళ్లు ఓర్వలేరుట. గ్రీకు పురాణ గాథలు..."

"రండి లోపలి కెడదాం..."

"ఎవ్వళ్ళం టైఫాయిడ్ అనుకోలేదు. అరడజనుమంది స్పెష లిస్టులు పూనుకున్న రోగి ఆయువు మూడినట్లే. ఇరవైరోజు లయ్యాక ఫలానా అని నిర్ణయించారు. కాంప్లికేషన్ ఉందేమో చూడండన్నా— నా మాట పెడచెవినపెట్టారు. ఆమెకు తెలుసు బ్రతకనని. నన్ను దగ్గరకు రమ్మంది. మంచం బద్దీమీద కూర్చున్నాను. నా రెండు చేతులూ పట్టుకుంది. ఆమె కళ్ళు చాలా పెద్దవిలే. నీరసించిందేమో, మరీ పెద్దవిగా కనిపించాయి. కన్నీరుతో, "మీరు సరోజను చేసుకోండి" అంది. నాకు ఏడుపులో నవ్వొచ్చింది.

"చనిపొయ్యేవారికి బ్రతికున్నవారంటే అంత తాపత్రయం ఉంటుంది కాబోలు!"

"రండి..."

"లోపలికెందుకు-బైటకెళ్ళి టీ తాగొద్దాం. ఈ ఆడాళ్ళున్నారే- భలే అసాధ్యులబ్బాయ్. వాళ్ళకి కొన్ని విషయాల్లో దూరదృష్టి ఉంది. ఏకాంతంగా మొగాడు పొయ్యే పోకళ్ళు వేసే వేషాలు, ఇట్టే పసిగట్టేస్తారు. వాళ్ళింటి పక్కన మోహనరావని ఉండేవాడు. గౌరవమైన కుటుంబీకుడు. వాళ్ళింట్లో పనిచేసే పిల్ల ఓసారి కళ్యాణితో అన్నదిట ఏదో మాటల సందర్భంలో "అమ్మగోరు చాలా మంచివారండి" అమ్మగోరంటే మోహనరావు సతీమణి అన్నమాట. ఆ రాత్రి కళ్యాణి నాతో అంది— ఏమందో తెలుసా ? "ఆ పసిపిల్లకి ఆరోమాసం—తండ్రి మోహనరావు ఆ పసిపిల్లని తీసుకెళ్ళిపొయ్యాడు. ఎందుకు చెప్పొచ్చాననంటే, కళ్యాణి విషయం యిట్లే గ్రహించింది."

ఇటు రండి—రోడ్డు సమీపంగా లారీలు ఆపేసు" అని ఆయన్ని లాగాను. హోటలు కెళ్ళాం.

"సరోజ పెళ్ళంటే ఇష్టంలేనట్టు, మొగాడంటే గిట్టనట్టు నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తుందా—అదంతా నటనే ననుకో. నన్ను తెగ వేళాకోళం చేసేదిలే. సరోజ వాళ్ళక్కంత చక్కందికాదు. కాని అంతకంటె గడసరి—నేనో—ఉత్త అమాయకుణ్ణి. మా ఆవిడన్నట్లు, సరోజని గురించి నాకే యితర అభిప్రాయం, అప్పుడూలేదు. ఇప్పుడూ లేదు. కళ్యాణిని తృప్తిపరచడం కోసం సరేలే, అని వాగ్దానపూర్వకంగా అన్నాను. కాని నాకు నిజంగా ఆమెను చేసుకోవాలన్న ఉద్దేశం లేదు. ఎందుకంటావా, మనది బిజీలైఫ్—పెండ్లికి ప్రేమకి టైంలేదు. ఈ ఆడాళ్ళున్నారే, మన జీవితం అంతా వారి సమక్షానా, వారి ఆరాధనలో గడపమంటారు. నా కది సాధ్యం కాదు. సరోజ తల్లి కూడా ఆమెను చేసుకోమని చాలామందిచేత చెప్పించింది. ఆఖరికి ఏమైందో తెలుసా?"

టీ త్రాగి మళ్ళీ ఇంటివేపు బైలుదేరాం. అతను మాట్లాడుతూనే ఉన్నాడు. నా ఆలోచనలు నేను వేరే సాగిస్తున్నాను. ముకుందానికి వస్తు సేకరణలో పక్షపాతం లేదు. అతని కన్ని వస్తువులూ, ఉదంతాలూ, వ్యక్తులూ సమానమే. అన్నీ అతని వాగ్దేవిని సమంగా పురికొల్పి, సమమైన శీవితో ధ్వనులను ప్రసారం చేస్తాయి. భార్య మరణం, సరోజ పెళ్ళి, గుర్నాథంగారి ఇల్లు, హాకీ ఆటలో రంగయ్యనాయుడు ఓటమి, కిళ్ళీలో సున్నం ఎక్కువవడం ఇవన్నీ అతనికి మహాకావ్యాలే. ఎక్కువతక్కువలు లేకుండా వేదాంతిలా నిశ్చల మనస్కుడై వితర్కిస్తాడు. మౌనం యోగి తపస్సు; భాష, ధ్వని ఇతని తపస్సు, ఊహ ద్వారా ఒక ప్రపంచాన్ని శాసించాడు. ఆ జగత్తుకి అతను చక్రవర్తి. మనం అంతా అతని ప్రజలం. రాజుగారు మాట్లాడేటప్పుడు అందరూ నిశ్శబ్దంగా ఉండాలి.

అతను చవిచూడని అనుభవం లేదు – లోనుగాని ఉద్రేకంలేదు.

జయించని తృష్ణలేదు; తరచిచూడనిరహస్యానుభవం లేదు, కనని కలలేదు. ఆడని అబద్ధంలేదు. తెలియని సత్యంలేదు. రాజ్యవిస్తీర్ణము, సరిహద్దులు తెలియని చక్రవర్తిలాగా, భార్యమరణంతో అతను మానసికంగా పేట్రేగి పొయ్యాడు. జీవితగమనం వేగం తగ్గి నిదానంగా జరుగుతోంది-కాని, అతని ఆరాటం, ఆవేదన వేగిరపడుతున్నాయి. ఏదో సిద్ధాంతం, సందేశం, జీవితదృక్పథం అర్థి మనల్నందర్నీ అందులో చిక్కించుకుని స్థిమితపడదామని అతనికి తెలియని సంకల్పం లాగుంది. ఏదో భార్యపట్ల చిన్న అపచారంచేశాడు. దాన్ని తనకుతాను సమర్థించుకుని, పోయినవ్యక్తి క్షమాపణ పొంది, సమాధానపడటంకోసం, ఈ వేగిరపాటు-ఈ భాషా ప్రయుక్త వ్యక్తి స్వైరవిహారం, యీ నాదబ్రహ్మ స్మశాననృత్యం, ఈ వాగ్గేయకారుని చివరి ముక్తాయింపు.

"ఏమైందని అడగవేం?" అంటున్నాడు వెర్రివాడు. అతన్ని గూర్చిన ఆలోచనలు నన్ను వేదాంతశిఖరానికి చేరేశాయి. ఏది ఏమైతే ఎవరిక్కావాలి. అనంతవిశ్వంలోని ప్రపంచనిశ్శబ్దాన్ని ఒక్కమాటతో, ఒక్క అర్థశూన్యమైన ధ్వనితో ప్రాచీన ప్రశాంత గాంభీర్యాన్ని భంగపరుస్తున్నాడా ఈ వెర్రి మానవుడు!

పైకి మాత్రం 'చెప్పండి' అన్నాను.

"సరోజ నన్ను చేసుకోనని కచ్చితంగా చెప్పేసింది. ఎందుకనీ? ఆమెకు నామీదవుండబట్టేగా. తనకు నామీద వున్న ప్రేమని మరోలా ప్రకటించలేకపోయింది. అక్క బ్రతికివున్నప్పుడు ఎంత గారం, ఆప్యాయత, ఆదరణ, స్నేహం చూపించిందనుకున్నావ్! అది వెన్నెలరాత్రి. కళ్యాణి రంగమ్మగారితో గుళ్ళోకెళ్ళింది. అప్పుడే క్లబ్ నుంచి వొచ్చి స్నానంచేసి, డ్రెస్ చేసుకుంటున్నా. గదిలో కొచ్చింది సరోజ. అద్దంలో నా మొహంకేసి చూసింది.

"నువ్వు ఆలయానికి వెళ్ళలేదా?" అని అడిగా.

"ఆ ప్రశ్న నేనే అడుగుదా మనుకుంటున్నా-నా కేం కోర్కెలు లేవు" అన్నది. "అంటే?" అన్నాను.

"పిల్లలు కావాలని ఏ౯కా భార్యమాత్రం ప్రదక్షణాలు చేస్తే లదు. నువ్వూచేయాలి" అంది. "మంచి భర్తని ప్రసాదించమని నువ్వూ కోరుకోవచ్చుగా" అన్నాను దెప్పుతూ. "నాకల్లాంటికోర్కెలూలేవు, నమ్మకాలూలేవు" అంది. "అంతా మానవ ప్రయత్నమేగాని దేవుడి ప్రమేయం లేదంటావు. నీనమ్మకాలు, ఆదర్శాలు, ప్రయత్నాలు వాటి ఫలితాలు కాస్తంత ఈ అల్పుడి చెవిని పడెయ్యి" అన్నా వేళాకోళంగా.

"ప్రయత్నం చెయ్యనిదే నాకు పెళ్ళికాదంటావ్?"

"పిల్లలకోసం మా ప్రయత్నంలాంటిదే అనుకోకూడదూ?" అని, తువ్వాలు బుజాన వేసుకుని డాబామీదికి నడిచాను. నా సంభాషణంతా అద్దంలో సరోజతోనే. నాకేసి అదోలా చూసెంది - అట్లాగనిపించింది పదివిమిషాల్లో డాబామీదికి తనూవొచ్చింది.

"కోపం వచ్చిందా?"

"ఎవరిమీద?"

"నామీద"

"ఎందుకు?"

"మొగాళ్ళకెందుకు కోపమొస్తుందో నాకేం తెలుసు?"

"ఇంకా నీకే వచ్చింది కోపం, అవునా?"

"ఎందుకో?"

"స్త్రీ మనస్సు తెలియ బ్రహ్మతరంబా?"

"పోనీ తెలిసినంత వరకూ చెప్పు—భయంలేదు. రోడ్డు వెంప చూస్తున్నాలే. అక్కయ్య రావడం లేదు" అన్నది. నాకు నిజంగా కోపం వచ్చింది. "అక్కయ్యంటే నువ్వుభయపడాలి—నీమనస్సులో ఏదోవుం " అన్నాను. సరోజకి కోపం వచ్చినట్టుంది. అక్కయ్య ముందు సి

అమాయకపు అవతారం నాకు తెలియదనా-అక్కయ్యకి తెలీదనుకోకేం-నా మనస్సులో ఏదో వుందిట. మహాకనిపెట్టావులే-నామనస్సులో ఎవరున్నా లేకపోయినా, నువ్వుమాత్రం లేవు" అని కిందకివెళ్ళిపోయింది. అది ప్రేమ కాకపోతే, ఏమిటంటావ్?"

ఇంటికి చేరుకొని వరండాలోకి కుర్చీలు లాక్కుని కూర్చున్నాం. భోజనానికి హోటలి కెళ్ళడమా, కారియార్ తెప్పించడమా అన్న ఆలోచన సాగనియ్యకుండా మళ్ళీ మొదలెట్టాడు. ఇంక రాత్రంతా జాగారమే. ఏ పరమాత్మకీ నాపైన కటాక్షం కలగదూ! నేను మాట్లాడడం మొదలెడితే!-ఒక యత్నం చేశా.

"చూడండి—మీరు సరోజపై మరికొంత అప్యాయత కనబరిస్తే..."

"చాల్లెండి; సరోజవిషయం మీ రెరుగరు కొందరు స్త్రీలంతే. వాళ్ళని తిట్టి, హింసించి, బాధపెట్టినవారిని గాని కనికరించరు. ఓసారి..."

ఇంక లాభంలేదు. ఆ యత్నం విరమించి, చంద్రుడికేసి చూస్తూ నా పగటికలలు కంటూ కూర్చున్నాను. పగటి కలలు మానవహృదయానికి స్వర్గంలాంటివి. నాకుక్రాస్‌వర్డ్ పజిల్‌లో ఇరవైవేలొస్తే ఎల్లా ఖర్చు పెట్టేదీ వూహించుకుంటాను. సరోజను— నే చూశ్శే దనుకోండి - వివాహమాడి వుంటే నా జీవిత మెల్లా వుండేదీ వూహించుకుంటాను. ముకుందం కబుర్లని కళ్యాణి ఎల్లా భరించగలిగిందో? ఆమె దగ్గరకూడా యిల్లాగే మాట్లాడతాడా - ఆవిడ వింటుందా? ఇప్పుడు ముకుందం ఏమంటున్నాడో విందామని పగటికలని తుడిచేసి, అతనికేసి చూశాను.

"మా ఆవిడంటుంది—నేను తనదగ్గర వున్నప్పుడుకంటే దూరంగా వున్నప్పుడు తనకి దగ్గరగా వున్నట్లు వుంటుందిట. అల్లాగంటుందిగాని, దూరంగా వుంటే "ఎప్పుడొస్తారు?" అని టెలిగ్రాంమీద టెలిగ్రాం లిస్తుంది. దగ్గరగావుంటే ఎప్పుడు వెడతాడురా బాబూ - అన్నట్లుగా ప్రవర్తిస్తుంది - మీకూ అల్లాగే అనిపిస్తోంది కదూ?"

ఒక్కసారి ఉలిక్కిపడి కుర్చీలోంచి లేచాను.

"ఇంకా నయం-ఎంతమాట!" అన్నాను. ఇంక నాకు ఆ రాత్రికి మోక్షం లేదు. హాయిగా ఆయనకి లొంగిపోయి, ఆ ధ్వని సాగరంలో పూర్తిగా మునగడం మంచిదనుకుంటూండగా, దైవం నా భక్తికి మెచ్చి పరంధామయ్యని పంపించాడు. తుపానులో రైలు దొరక యిరుక్కుపోయిన వ్యక్తులలో పరంధామయ్యే ఒకడు. నాకు స్నేహితుడు. ప్రసిద్ధ రచయిత. ఆయన్ని ముకుందానికి వప్పగించి నేను కాస్తంత స్వేచ్ఛ పొందవచ్చు.

"పరంధామయ్యగారని- 'హాయిగొల్పే హానొలులు' అనే యాత్రా గ్రంథం వ్రాశారు. అమెరికా, జపాను దేశాలు తిరిగొచ్చారు" అని ముకుందానికి పరిచయము చేశాను.

"అయ్యో! ఆయన్ని ఎరక్కేం... వెనకటికి ఓసారి చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారికి సజ్జాపురంలో సన్మానం తలపెట్టారు. మా మావ గారి తండ్రి అధ్యక్షులుట......"

పరంధామయ్య హితం అనుకుని కారియర్ విషయం చూస్తానని బైటకొచ్చి, నిశ్శబ్దంగా గాలి పీల్చానని రహస్యంగా ఒప్పుకుంటున్న స్వార్థపరుణ్ణి.

బస్‌స్టాండు దగ్గర గాని మసలయ్యకి చుట్ట కాల్చుకునేటందుకు సరైన స్థలం దొరకలేదు. అక్కడ దొరికాడు. తీసుకొచ్చి, కారియర్ యిచ్చి హోటల్‌కి పంపించాను. ఎనిమిది కావొస్తుంది. పరంధామయ్య- ఆ సాహిత్య సభల్లో గంటలు గంటలు ఉపన్యసించే పరంధామయ్య - ఆ ప్రవాహంలో వుక్కిరి బిక్కిరవుతున్నాడు. నన్ను చూడగానే లేచాడు.

"యింతకీ యీాయనెవరో పరిచయం చేశావు కాదు" అన్నాడు కాస్త కోపంగా. సమాధానం చెప్పే ప్రాప్తి నాకు లేదు. ముకుందం దొరక పుచ్చుకున్నాడు.

"నేనూ రచయితనే - ఓ వెయ్యి పేజీల గ్రంథం వ్రాశాను"

"ఎప్పుడూ చెప్పారు కాదేం. అచ్చయిందా?" అన్నాను ఎల్లాగో సందుచేసుకుని.

"అంటే బుర్రలో వ్రాశాను. కాగితం మీద వ్రాయడం ప్రారంభించాలి. చాలా పెద్దగ్రంథం, రెండు వేల పేజీలు పట్టొచ్చు. ఇంకా పేరు పెట్టలేదనుకో–"

"ఏం పేరు పెడితే బాగుంటుందంటారు?"

"విషయమేమిటో తెలిస్తే—" పరంధామయ్య వాక్యం మరో లోకంలో పూర్తవుతుంది.

"అదే చెబుదా మనుకుంటున్నా, మొన్న వ్యవసాయశాఖ వారికి పిటిషన్ పెట్టానా – నేనూ లాయర్నే – ఐనా లా పదాలు వాడకుండా, అతిసుళువైన సరళమైన భాషలో వ్రాశానేమో–ఎందుకంటే మా మామ గారి యింట్లో వంటాయన శరభయ్యకి కూడా ఇట్టే అర్థమైంది. విషయము బోధపడగానే ముక్కుమీద వేలేసుకున్నాడు."

పరంధామయ్య దగ్గరుండడం వల్ల కాబోలు, కొంచెం ధైర్యంచిక్కి సందేహ నివృత్తి కుపక్రమించాను.

"మీ మామగారింట్లో వున్నది వంటలక్కగా" అన్నాను. ముకుందాన్ని పట్టి వేయించ గలిగానని గర్వపడుతూ.

"సరేలే – ఆవిడెప్పుడో వెళ్ళిపోయింది, వెండి ముక్కు పొడుం డబ్బీ, అరడజను యింగువపొట్లాలూ తీసుకొని. నేనారా తీశాను. అత్తగారూ వాళ్ళూ ఆడదాన్ని యాగీ చేయడమెందుకని వూరుకోమన్నారు. శరభయ్యని కుదిర్చి పెట్టింది నేనే. వాడున్నాడే, వంట చెయ్యడంలో భీముడు. అతని చేతి భోజనం ఒక్కసారి తిన్నట్లయితే, పొట్టి శ్రీరాములు ఈనాటికి జీవించే వుండును. నా గ్రంథంలో ఒక అధ్యాయము అతన్ని గురించే."

"మీరు వ్రాసే చరిత్ర స్వీయ చరిత్రన్న మాట—"

"అసలు విషయం చెప్పనివ్వండి–చాలమంది చంపుకు తింటు

న్నారు, మీ చరిత్ర వ్రాయండని-నాకు తీరికేది? జీవించదల్చుకున్న వారికి గ్రంథ రచన పడదేమో! ఓసారి—"

భూకంపం ఏ ప్రాంతంలో ఏ సమయంలో చెలరేగుతుందో ఎవరు చెప్పగలరు? పెద్ద ఓటలు తీసింది. పరంధామయ్యా నేనూ అందులో పడిపొయ్యాం - ఓ పావుగంట. తెప్పరిల్లి "దాహం" అన్నాడు పరంధామయ్య. అని తనే లోపలి కెళ్ళాడు.

శరభయ్య మా కక్కర్లేదంటే నా దగ్గరే అట్టేపెట్టేసుకున్నాను. పేరమ్మని నా దగ్గిరే వుంచుకున్నాను! ఏంచెయ్యను-తెలుగు భాషలోపం-వుంచుగోక తప్పదు. చురుకైనపిల్ల. మొగుణ్ణి వదిలేసింది. వాడే వదిలేశాడనుకో - రంగం వెళ్ళాడు. రాజకీయాలు వదులుకున్నాను. ఆటలు, పాటలు వదులుకున్నాను. కృష్ణా రామా అనుకుంటూ, పొలం, తోట చూసుకుంటూ కడుపులోచల్ల—"

ఇంతలో బాబోయ్" అని లోపల్నుంచి పరంధామయ్య గావు కేక వేశాడు. తొందరగా వెళ్ళాం. ఆయనకి తేలుకుట్టిందట. కాలు గట్టిగా అదిమిపట్టి, "మంత్రగబ్బేమోకాస్త చూడండి. ఇది మామూలు తేలుకాదు" అని బాధపడుతున్నాడు. నేను నాలుగు మూలలూ చూస్తున్నాను "కనబడదేం?" అన్నాను. "నీకు స్వాగతం యిస్తూ ఎదురుగా వస్తుంది. మరీ మందేంలేదూ? డాక్టరేవడూ లేడూ?" అంటున్నాడు.

ముకుందం మళ్ళా మొదలెట్టాడు. "ఓ సారి పేరమ్మ కిల్లాగే తేలుకుట్టింది. దాని కెంత బాధకలిగిందంటే, "చూడి తేలుకుట్టెందర్రోయ్" అని కేక వేసింది. కాదు, చీమన్నాను నేను. వెదకడం మొదలెట్టారు—"

"డాక్టర్ని తీసుకురండి – మంత్రం వెయ్యలేరూ—"

"మీ రిక్కడే వుండండి, డాక్టర్ని తీసుకొస్తాను" అని బైలుదేరాను. "నువ్వు తిరిగొచ్చేటప్పటికి నా ప్రాణమే పోతుంది. ఉండు నేనే వసాను"

నేను పరంధామయ్యను తీసుకుని బైటకెళ్ళి ఓ రిక్షా మాట్లాడి అందులో ఎక్కాం.

"మీకు మంచిటైమ్‌లో, అలారమ్ మోగినట్టు - తేలు కుట్టిందండి లేకపోతే నా రైలు తప్పను ప్రొద్దున పదింటికి దిగాను. పది గంటలు లేటన్నారు. అంటే, ఎనిమిదింటికన్న మాట. ఇప్పుడు పావుతక్కువ ఎనిమిది. కాబట్టి నాకు రైలందుతుంది. మనకు ఢిల్లీ ప్రయాణము తప్పదు. ఓసారి నేను, లేబర్ కమీషనర్ రంగనాధం ఢిల్లీ ప్రయాణం కట్టాం. నాగపూర్ చేరేటప్పటికి—" రిక్షా మలుపు తిరిగింది. ఓ జట్కా ఆపుచేయించి, ముకుందాన్ని అందులో ఎక్కమని, సెలవు తీసుకున్నాం. మమ్మల్ని తనవూరు ఆహ్వానించాడు. అల్లాగే అన్నాం. ఏదో చెబు తున్నాడు - జట్కా దూరంగా వెళ్ళింది. రిక్షావాణ్ణి తిన్నగా హోటల్‌కి పట్టమన్నాడు పరంధామయ్య. కారియర్ యింటికొస్తుందిగా అన్నాను. ఇంటికెడితే యీసారి నిజంగా తేలుకుడుతుందన్నాడు పరంధామయ్య.

ఇది జరిగిం తర్వాత ముకుందాన్ని నేను కలుసుకోలేదు. అటు వెడుతూ ఓసారి పరంధామయ్య, ముకుందం బంగళాని, తోటని చూచి, ఓపూట భోజనంచేసి వొచ్చినట్లు, వివరాలన్నీ వుత్తరం ద్వారా తెలియ బరిచాడు. శరభయ్య వొంట అద్భుతంట. పేరమ్మ బ్యూటీట. రోజూ పది మందికి తక్కువుండరట భోజనానికి. ఆయనకున్న పలుకుబడి, పేరు, అంతా శరభయ్య వొంట మూలంగానేట. అతని స్వీయచరిత్ర క్లుప్తంగా నాలుగు గంటలు చెప్పాడుట. అది వినగానే తిన్నదంతా అరిగిపోయిం దిట. "నా సంభాషణ వల్ల జీర్ణం కాని పదార్థంలేదు." అని ముకుందం నిర్వచనం చేశాడుట.

అట్లాంటి ముకుందానికి ఎందుకు మతిభ్రమించి, పిచ్చాస్పత్రిలో వుండాల్సి వచ్చిందో నాకు బోధపడలేదు. కొద్దిగా మానసిక శాస్త్రం నేనూ చదివాను. సంసార సుఖం లేకపోవడం అతి వాగుడికి వో కారణంగా చెప్తారు. ప్రేమ తృష్ణ మాటల ద్వారా తీర్చుకుని తృప్తి పడటం చిహ్నం.

నాకిది సరైన కారణంగా తోచలేదు కృత్రిమంగా వూహిస్తే ఏవేవో చిత్రమైన కారణాలు కల్పించవచ్చు. జాడ్యం ఎంత కృత్రిమమైందో, దానికి మందు కూడా అంత అపూర్వంగా వుంటుంది. గుడ్డివాడు విసిరిన బెడ్డ లాంటిది మానసిక శాస్త్రంలో మందు. తగులుతే తగులుతుంది, లేకపోతే లేదు. నే మొదట్లో అనుకున్న కారణమే నా కిప్పటికీ సమంజసంగా కనబడుతోంది. ముకుందం మంచివాడు, స్వార్థరహితుడు. జీవితంలో ఏదీ కోరకుండా, అన్నీ మెచ్చుకొని సర్వమూ వదులుకున్న యోగి. విలువలు కట్టని విమర్శకుడు, సిద్ధాంతాలు అమాయక ప్రజ నెత్తిన రుద్దని వేదాంతి. అయినా అతని బారి నుండి పారిపోడానికి నేనూ ప్రయత్నం చేశాను. భార్య విసుగెత్తి ఇకచాలు బాబు అనుకుని పరమపదించింది సరోజ పెళ్ళి చేసుకోనంది. అందరూ అతన్నుండి పారిపోయి అతన్ని ఏ కాకిని చేశారు. నా కళ్ళంట అప్రయత్నంగా నీళ్ళు తిరిగినై. పాపం, అతనేం అపచారం చేశాడు ? రెండు రూపాయలిచ్చి – కర్నాటక సంగీత విద్వాంసుడు, వయొలిన్, మృదంగం కలిసి మూడు గంటలు ముమ్మొన యుద్ధం సాగిస్తే చూసి, విని 'ఆహా, ఎంత అద్భుతంగా వుందండీ' అని చెప్పగోడంలేదు ? మనం ఖర్చుపెట్టిన రెండు రూపాయలనీ సమర్థించేటందుకు కాక, మరెందుకు, మనం మెచ్చుకోడం ? కానీ ఖర్చు లేకుండా ముకుందం మనకి వినోదం కలిగిస్తే ఏవగింపా ? అతనికి పేర్లెట్టి హేళన చెయ్యడమా ?

నీతిలో మెళకువలు తెలిసున్నవాడు ముకుందం. ఏనాడో భార్యకి అపచారం చేశాడు. దాన్ని ఎదుర్కొన్నాడు. తను సమాధానం పడలేక పోయాడు. సంఘానికి చెప్పేసి, పాప పరిహారాని కుపక్రమించాడు. మాటల ద్వారా అదీ నాకు తోచిన కారణం. అతను జీవితంలో దేన్నీ కోరడు. ప్రతిఫలం కోరని సంభాషణ – అతని మాట పడిపోయిందంటే నాకీ ప్రపంచంలో ఏదో తీరని లోటు కనబడింది. అతని భార్య కళ్యాణి

అన్నట్లు అతను దూరంగా వున్న కొద్దీ దగ్గరగా వొచ్చినట్లుంటాడు. దగ్గరగా వుంటే తప్పించుకు తిరుగుతాను నాకు క్షమ లేదు.

అతని జీవితంలో ఏదో లోటుంది. దాన్ని శోధించి ఎవ్వరూ బైట పెట్టకుండా అతను "మాటలు" అనే వల అల్లుకున్నాడు. అతన్ని కదిపి మాట్లాడిస్తే అదేమిటో బైటపడును. కాని ఇప్పుడు ఆ అవకాశం లేదు. అతనికి మాటపోయింది. దిగులుగా కూర్చున్నాను. "ఏమోనీ, ఓసారి వెళ్ళి చూసి రాకూడదూ ?" అంది మా ఆవిడ.

ఆ రాత్రే బెంగుళూరు ప్రయాణం అయ్యాను. హాస్పిటల్‌కి వెళ్ళే ప్పటికి సాయంత్రం నాలుగైంది. బైట ముకుందం తమ్ముణ్ణి కలుసు కున్నాను. అతను చెప్పాడు కొన్ని సంగతులు. పనిపిల్ల పేరమ్మ, వంటా యన శరబయ్యతో లేచిపోయిందిట. వాళ్ళని వెదుక్కుంటూ తిరిగాడుట ముకుందం. పేరమ్మని స్టేషన్‌లో పట్టుకున్నాడుట. ఇద్దరినీ యింటికి రమ్మనమని బ్రతిమలాడాట్ట. జీతం ఎక్కువ చేస్తానన్నాడుట. రానందిట. ఏదో వాగిందిట. అతని మామగార్ని, భార్యని, సరోజని – వాళ్ళ కుటుం బాన్ని చులకన చేస్తూ మాట్లాడిందట. లెంపకాయ కొట్టాడుట. మళ్ళా ఏదో అందట. "నేనందుకు కావాల్సి వొచ్చానా ? ఇప్పుడనండి ఏమం టారో ?" అని సవాల్ చేసినట్లు మాట్లాడిందిట. పళ్ళు బిగబట్టి మొహం ఎర్రగా అయి, చేతులతో రక్కేటట్లుగా అభినయం చేశాట్ట. కాని నోటంట మాటరాలేదుట. ఇవన్నీ పేరమ్మ చెప్పిందిట.

జీవితంలో ఏదీ ఆసించని వాడికి అసంతృప్తి వుండదు. కోరింది లభించలేదన్నప్పుడు వొచ్చే కోపంరాదు. ముకుందం ఉద్రేకాలకి అతీ తుడు. కార్యశూరులు కోపానికి గురవుతారు. అతను ఏ కార్యం తల పెట్టడుచెయ్యడు. కోపం అంటే ఏమిటో ఎరగని అమాయకుడు. అట్లాంటి ముకుందాన్ని పేరమ్మ రెచ్చగొట్టింది. కోపం తెప్పించింది. దాని తీవ్రతకి అతని శరీరం తట్టుకోలేకపోయింది. వ్యక్తిత్వానికి "షాక్" తగిలింది. తేరుకోలేక పొయ్యాడు. "మాట" అతని ఆయుధం, అతని ఆయువుపట్టు.

దాన్నే సవాల్ చేసింది పేరమ్మ. ఆయువుపట్టు మీద దెబ్బ కొట్టింది. ఊహా జగత్తు పేలి పోయింది. మానసిక గోళాలు ఢీ కొన్నాయి. వాటి మధ్య నలిగి ధ్వని యంత్రం నిలిచిపోయింది.

లోపలి కెళ్ళి చూశాను. దిగులుగా కూర్చున్నాడు. పెరిగిన గడ్డములో తెల్లవెంట్రుక లున్నాయి. కళ్ళ కింద గీత లున్నాయి. జుట్టంతా చిందరవందరగా వుంది. పిచ్చివాడులా వున్నాడు. నన్ను చూశాడు. నా కళ్ళల్లోకి లోతుగా చూశాడు. ఏమీ మార్పు లేదు అతని ముఖంలో. మందహాసం లేదు. నేను ఫలానా అన్న చైతన్యం లేదు. నాకు జాలేసింది ఇల్లాగన్నాను :

"ముకుందం గారూ – మీరు జీవితంలో అన్నీ సాధించారు, వొక్కటి తప్ప – మౌనంగా, నిశ్శబ్దంగా వుండటం తప్ప అన్నీ సాధించారు. మీరు నిండైన, పరిపూర్ణమైన ధన్య జీవులు."

ఏదో చప్పుడైంది – సంకెళ్ళు వూడిపడ్డట్లు, సముద్రం వెనక్కి వెళ్ళి ఎండినట్లు, భూకంపం ఓటలు మూసుకుని లోలోన అణగారినట్లు, కాలచక్రం వొక్కసారి కదిలినట్లు.

"ఆ, నేను మాట్లాడలేనంటారా ? నేను మూగనా – నిశ్శబ్దమా – మౌనమా ... ఎందుకు మాట్లాడలేను. వినడం చేతకాని వారికి మాట్లాడ్డం చేతకాదు. వారే మూగ వారు. ఓసారి విజయనగరంలో అష్టావధానం జరిగింది. పదిమందీ పది ప్రశ్న లడుగుతారు. వారికి సమాధానాలు, గంట తర్వాత క్రమంలో చెప్పాలి. నే నో ప్రశ్న అడిగాను. తికమకగా – కాకిగూటిలో చిలుకపిల్ల వుంటే, తోడేలు చెట్టుకింద వున్నప్పుడు, పెద్ద పులి అరుస్తే భయపడేది చిలుకపిల్లా, కాకా, తోడేలా - క్రమంలో చెప్పాలి ..."

(14)

అల్లా ముకుందం గారు యథావిధిగా తన ధోరణి సాగించారు. ఆయన మాట్లాడిన వాక్యానికి ప్రతి ధ్వని లేదు. వాక్యం ముగించినప్పుడు కదా ప్రతిధ్వని వినబడేది ? ఆ ముగింపు లేదు – ఆ ప్రతిధ్వని లేదు. నాకీ లోకంతో ఇంక పేచీలేదు.

ఈ కథలో ముకుందానికి అన్యాయం చేశానా ఎక్కడేనా అని తిరిగి చూశాను. ఒకచోట చేశాను. రైళ్ళాగిపోయి, రెండోసారి నన్ను కలుసుకున్నప్పుడు "రండి టీ తాగొద్దాం" అని ముకుందం అన్నట్లుగా వ్రాశాను. అది పొరబాటు. అలా ముకుందం అనలేదు, అనడు. టీకి భోజనానికీ, స్థూల జగత్తులో శారీరకావసరాలకి అతనికి టైము లేదు. వీటితో ఆ ఊహా సామ్రాజ్య చక్రవర్తికి నిమిత్తం లేదు. అతను హాస్పిటల్‌లో వున్న ఆ వారం రోజులే కాలచక్రానికి విరామం.